వందశాతం పన్ను వసూళ్లపై దృష్టి

- కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేసిన ఇన్‌చార్జి ఎంపీడీవో



సోమనపల్లి గ్రామ పంచాయతీ

రామగుండం: అంతర్గాం మండల పరిధిలోని 16 గ్రామ పంచాయతీల్లో 2024–25 ఆర్థిక సంవత్సరానికి మొత్తం పన్నుల డిమాండ్ రూ.46.95 లక్షలు కాగా ఇప్పటికే రూ.38.64 లక్షలు అనగా 82శాతం వసూలయ్యాయని ఇన్‌చార్జి ఎంపీడీవో బైరి వేణు మాధవ్ తెలిపారు. ఆర్థిక సంవత్సరాంతంలోపు 16 గ్రామ పంచాయతీల్లో వందశాతం పన్నులు వసూలు లక్ష్యంగా మంగళవారం పంచాయతీ కార్యదర్శులకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామాల వారీగా పన్నుల వివరాలు పరిశీలిస్తే..

గోలివాడ రూ.2,53,690, విసంపేట రూ.98,262, లింగాపూర్ రూ.1,30,859, రాయదండి రూ.39,827, ముర్మూర్ రూ.3,48,390, ఆకెనపల్లి రూ.1,37,592 తదితర గ్రామాల్లో 40రోజుల ముందే వందశాతం పన్నులు వసూలయ్యాయి. ఎల్లంపల్లిలో 99.4శాతం పూర్తికాగా, ఎగ్లాస్‌పూర్‌లో 83.4శాతం, బ్రాహ్మణపల్లిలో 80.11శాతం, మద్దిర్యాలలో 87.99శాతం, టీటీఎస్ అంతర్గాంలో 78.72శాతం, పొట్యాలలో 57.04శాతం, పెద్దంపేటలో 69.23శాతం, కుందనపల్లిలో 78.65శాతం, సోమనపల్లిలో 59.39శాతం, అంతర్గాంలో 89.41శాతం పన్నులు వసూలయ్యాయి.

గ్రామాలపై ప్రత్యేకదృష్టి



మండల పరిధిలోని పొట్యాల, సోమనపల్లి గ్రామాల్లో మిగతా గ్రామాలతో పోల్చితే తక్కువ పన్నులు వసూలయ్యాయి. అత్యధిక ఆదాయం వచ్చే కుందనపల్లిలో సైతం క్రమంగా వసూలవుతున్నాయి. మిగతా గ్రామాలపై ప్రతీరోజు ప్రత్యేక దృష్టిసారిస్తున్నాం. మార్చి 31లోగా అన్ని గ్రామాల్లో వందశాతం పన్ను వసూళ్లు పూర్తి చేస్తాం.

– బైరి వేణుమాధవ్, ఇన్‌చార్జి ఎంపీడీవో, అంతర్గాం

కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం కృషిచేయాలి



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్

ధర్మారం: పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్‌రెడ్డిని అధిక మెజార్టీతో గెలిపించడానికి ప్రతీ కార్యకర్త కృషిచేయాలని ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్ కోరారు. ధర్మారం మండల కేంద్రంలోని గౌతమిబుద్ధ ఫంక్షన్ హాల్‌లో గురువారం పార్టీ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పట్టభద్రులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విప్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు అండగా ఉండే ప్రభుత్వమని, పట్టభద్రులను కలిసి ఓట్లు వేయించాలని ఆయన కాంగ్రెస్ నాయకులకు సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య రూప్లానాయక్, వైస్ చైర్మన్ అరిగె లింగయ్య, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు యశోద అజయ్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు సోగాల తిరుపతి, మాజీ ఎంపీపీ కోడారి అంజన్న, నాయకులు బద్దం అజయ్‌పాల్‌రెడ్డి, దేవి జనార్దన్, బొల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా పోచమ్మతల్లికి బోనాలు



బోనాలతో శోభాయాత్రగా వెళ్తున్న మహిళలు

జూలపల్లి: మండల కేంద్రంతో పాటు పెద్దాపూర్‌లో యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మతల్లి బోనాలు కనుల పండువగా నిర్వహించారు. మహిళలు బోనాలతో గ్రామంలో శోభాయాత్ర నిర్వహించి బొడ్రాయి వద్ద పూజలు చేశారు. పోచమ్మతల్లికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రఘువీర్‌సింగ్, బీజేపీ రాష్ట్ర నాయకులు జేకే శేఖర్‌యాదవ్, సంఘం నాయకులు జేకేయాదవ్, మహేశ్, నాగరాజు, ఐలయ్య పాల్గొన్నారు.

మేధావులను చట్టసభలకు పంపండి

సుల్తానాబాద్: మేధావుల సభలో మేధావులు ఉంటేనే చట్టాలు చేసి ప్రజలకు ఉపయోగకరంగా ఉండేలా చేస్తారని సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు పడాల అజయ్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని కోర్టులో గురువారం న్యాయవాదులను కలిసి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణకు మద్దతుగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్పొరేట్ వ్యక్తులను కాకుండా సామాన్యులకు అందుబాటులో ఉండే వ్యక్తిని ఆదరించాలన్నారు. తుమ్మ రాజ్‌కుమార్, శ్రీకాంత్‌రెడ్డి, తుమ్మ నిశాంత్, పొన్నం చంద్రయ్యగౌడ్, ఆరెపల్లి సర్వేశ్, రమేశ్ పాల్గొన్నారు.

బీఎస్పీ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

జూలపల్లి: పట్టభద్రుల, ప్రైవేటు ఉద్యోగుల కష్టాలు తెలిసిన ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రసన్న హరికృష్ణను గెలిపించాలని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి సీపెల్లి కొమురయ్య కోరారు. బ్యాలెట్‌లో మూడో వరుసలో ప్రసన్న హరికృష్ణకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరుతూ పార్టీ నాయకులతో కలిసి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం జూలపల్లిలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు నర్ల గోపాల్‌యాదవ్, కాంపెల్లిబాబు, బొంకూరి దుర్గయ్య, సాతూరి అనిల్, నెరువట్ల రామస్వామి, మహేందర్ తదితరులు ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

• తడి, పొడి చెత్తపై అవగాహన

సుల్తానాబాద్: ఇంటి ముందుకు వచ్చే ఆటోకు తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ నియాజ్ సూచించారు. పట్టణంలోని పలు కాలనీల్లో ప్రత్యేక అధికారులు గురువారం ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రజలు వేర్వేరుగా ఇవ్వడంపై సేంద్రియ ఎరువులను తయారు చేసే అవకాశం ఉంటుందని వివరించారు. మున్సిపాలిటీకి ఆదాయం సమకూర్చేలా సహకరించాలని కోరారు. డ్రైనేజీల్లో గ్లాసులు, మద్యం, సీసాలు, ప్లాస్టిక్ కవర్లు వేయొద్దని సూచించారు. ప్రత్యేక అధికారులు, సిబ్బంది ఉన్నారు.

• ఉపాధిహామీలో గ్రామీణ రోడ్ల నిర్మాణం

జూలపల్లి: గ్రామాల్లో సత్వర అభివృద్ధికి ఉపాధిహామీ పథకంలో రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు ఏపీవో సదానందం తెలిపారు. మండలంలోని పెద్దాపూర్, తేలుకుంట, నాగులపల్లెలో చేపట్టిన రోడ్ల నిర్మాణ పనులను గురువారం పరిశీలించారు. పనిస్థలాల వద్ద కూలీలకు తాగునీరు, నీడ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచినట్లు వివరించారు. గ్రామీణ రోడ్ల నిర్మాణంతో రవాణా సౌకర్యం మెరుగు పడుతుందన్నారు. ఎఫ్ఏలు మల్లేశం, రజిత, మేట్లు ఉన్నారు.

• ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలు చేయాలి

సుల్తానాబాద్: దళితుల అభివృద్ధి కోసం ప్రకటించిన చేవెళ్ల ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కల్లెపల్లి అశోక్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని కేవీపీఎస్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు మొదుంపల్లి శ్రావణ్, నాయకులు సీపెల్లి రవీందర్, శేఖర్, రాజు, ఇమ్రాన్, సూరజ్ పాల్గొన్నారు.

• అగ్నివీర్ శిక్షణను వినియోగించుకోవాలి

రామగుండం: అగ్నివీర్ నియామకాలకు సంబంధించి నిర్వహించే ఉచిత శిక్షణ శిబిరాన్ని అంతర్గాం మండల పరిధిలోని యువతీ, యువకులు వినియోగించుకోవాలని ఎస్సై వెంకట్ కోరారు. గురువారం పలు గ్రామాల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు గోదావరిఖనిలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో 18 నుంచి 21 ఏళ్ల యువతకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నారని, శిక్షణకాలంలో ఉచిత భోజనం, వసతి సౌకర్యాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 21వరకు అంతర్గాం పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

• బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

జ్యోతినగర్: ఎన్టీపీసీలోని జిల్లా పరిషత్ మైదానంలో గురువారం బీజేపీ రామగుండం ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీజేపీ అభ్యర్థులను గెలిపించాలని వాకర్స్‌కు కరపత్రాలు పంపిణీ చేశారు. బీజేపీ బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థులు మల్క కొమురయ్య, చిన్నమైల్ అంజిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గాండ్ల ధర్మపురి, అరవింద్‌రెడ్డి, మచ్చ విశ్వాస్, గండబోయిన భూమయ్య, మిట్టపెల్లి సతీశ్‌కుమార్, కోడూరి రమేశ్ పాల్గొన్నారు.

• తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోం..

ఫెర్టిలైజర్‌సిటీ: బీఆర్ఎస్ నాయకుడు కౌశిక్ హరి రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌పై చేసిన ఆరోపణలను పాలకుర్తి మండలం ఎల్కలపల్లి మాజీ సర్పంచ్ చిట్టబోయిన రాజ్‌కుమార్ ఖండించారు. రామగుండం కార్పొరేషన్ 14వ డివిజన్ ఎల్కలపల్లి గేట్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రామగుండంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే రామగుండం ఎమ్మెల్యేపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా బీఆర్ఎస్ నాయకుడు కౌశిక హరి ఎమ్మెల్యేపై చేసిన మాటలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సతీశ్, నెలకంటి రాము, ఎర్రం హరినాథ్‌రెడ్డి, బూర్ల శ్రీనివాస్, కన్నూరి శంకర్, మానాల ప్రభాకర్, మల్లేశ్, అంజి, చందు, శ్యామ్ పాల్గొన్నారు.

• 24 గంటలు విద్యుత్ సేవలు

సుల్తానాబాద్: విద్యుత్ వినియోగదారులకు 24గంటలు సేవలు అందిస్తామని ట్రాన్స్‌కో ఎస్ఈ కె.మాధవరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సిబ్బంది, అధికారులు విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉండి మరింత మెరుగైన, నాణ్యమైన సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. ఎటువంటి విద్యుత్ సమస్య తలెత్తినా 1912 టోల్ ఫ్రీ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. వేసవి కాలంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ముందస్తు కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు చెప్పారు.

సీపీని కలిసిన ఫారెస్ట్ బాధితులు

గోదావరిఖని: తమ ఇళ్లు పీకేశారని, నిలువ నీడ లేకుండా ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యం చేశారని పేర్కొంటూ జన్నారం మండలం గడ్డం గూడెం గ్రామానికి చెందిన బుక్యా బలిరాం వాపోయాడు. గురువారం సీపీ కార్యాలయానికి వచ్చి సీపీ శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేశారు. తన ఇద్దరు కుమారులు, ఇద్దరు కూతుళ్లతో కలిసి ఐదు ఇళ్లు కట్టుకుని కొన్నేళ్లుగా జీవిస్తున్నామన్నారు. ఇళ్లు మొత్తం నేలమట్టం చేసి ఇంటి సామగ్రిని వాగులో పడేశారన్నారు. సుమారు 60మంది ఫారెస్ట్ అధికారులు ఐదు ఇళ్లు, పంట పొలాలపై దాడి చేసి విధ్వంసం సృష్టించారని, గిరిజనులైన తమకు న్యాయం చేయాలని వేడుకున్నాడు. సంబంధిత అధికారులతో మాట్లాడుతానని సీపీ హామీ ఇచ్చారు.

లక్ష్మీనరసింహ ఆలయంలో ప్రత్యేక పూజలు



జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్ శ్రీయోగానంద లక్ష్మీనర్సింహ స్వామి ఆలయంలో హైదరాబాద్ కుత్బుల్లాపూర్ బీజేపీ అసెంబ్లీ కన్వీనర్, పెద్దాపూర్ వాస్తవ్యులు జేకే శేఖర్‌యాదవ్ గురువారం ప్రత్యేక పూజల్లో పాల్గొని మొక్కులు చెల్లించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. బీజేవైఎం జిల్లా నాయకులు కంకణాల జ్యోతిబసు, సుమంత్ ఇండస్ట్రీస్ చైర్మన్ మహేశ్‌యాదవ్ పాల్గొన్నారు.

జూడో సంఘంలో జిల్లావాసులకు చోటు



సంజీవ్‌కుమార్, మహేందర్

సుల్తానాబాద్: రాష్ట్ర జూడో సంఘం కార్యవర్గంలో జిల్లావాసులకు చోటు దక్కింది. కరీంనగర్‌లో జూడో సంఘానికి ఎన్నికలు నిర్వహించగా రాష్ట్ర ఉపాధ్యక్షులుగా మాటేటి సంజీవ్‌కుమార్, సంయుక్త కార్యదర్శిగా సిలివేరి మహేందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్న జూడో సంఘం బాధ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో పెద్దపల్లి జిల్లా వేదికగా మెగా జూడో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

స్వయం ఉపాధితో ఆర్థికంగా ఎదగాలి

రామగిరి: మహిళలు కుట్టుశిక్షణతో స్వయం ఉపాధి పొంది ఆర్థికంగా ఎదగాలని లహరి డిజైనర్ సంధ్య అన్నారు. మండలంలోని కల్వచర్ల గ్రామంలో గురువారం రేండ్ల శారద కుమార్‌స్వామి దంపతులు ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందిన మహిళలకు న్యాక్ ఆధ్వర్యంలో రెండో రోజు శారదతో కలిసి సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కుట్టుశిక్షణ ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నారు. రాష్ట్ర బీసీ మహిళా ఉపాధ్యక్షురాలు సరోజ, న్యాక్ శిక్షకురాలు సబిత, రత్నాపూర్ మాజీ సర్పంచ్ పల్లె ప్రతిమ, శిక్షణ నిపుణురాలు శ్యామల, స్వప్న, కవిత, శివ పటేల్ పాల్గొన్నారు.

రాజకీయ ఉనికి కోసమే ఆరోపణలు



మాట్లాడుతున్న బయ్యపు మనోహర్‌రెడ్డి

పాలకుర్తి: రామగుండం నియోజకవర్గంలో దాదాపు రూ.300కోట్లతో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని కేశోరాం సిమెంట్ కంపెనీ పర్మినెంట్ కార్మిక సంఘం అధ్యక్షుడు బయ్యపు మనోహర్ రెడ్డి అన్నారు. గురువారం కన్నాలలో మండల కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ నాయకుడు కౌశికహరి రాజకీయ ఉనికి కోసమే ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌పై ఆరోపణలు చేస్తున్నారన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్, కేశోరాం కంపెనీ పర్మినెంట్ యూనియన్ ప్రధాన కార్యదర్శి దాడి మహేశ్, వర్కింగ్ ప్రెసిడెంట్ పర్వవేని శ్రీనివాస్, అమ్ముల కుమారస్వామి, మంచినీళ్ల బాబునాథ్, పొన్నం తిరుమల్, నాగుల వంశీ, పయ్యావుల శ్రీనాథ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మహిళల భద్రతే లక్ష్యం



అవగాహన కల్పిస్తున్న ఎస్సై లావణ్య

రామగిరి: మహిళలు, యువతకు ఎలాంటి సమస్యలు ఉన్నా పోలీసులను సంప్రదించాలని, మహిళల భద్రతే షీ టీం లక్ష్యమని షీటీం ఇన్‌చార్జి, ఎస్సై లావణ్య తెలిపారు. మండలంలోని నాగెపల్లి గ్రామంలోని కాకతీయ పాఠశాలలో గురువారం మహిళల భద్రత, సైబర్ క్రైం, ఆన్‌లైన్ మోసాలు తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. విద్యార్థులు బాగా చదివి ఉన్నత లక్ష్యం చేరుకోవాలని సూచించారు. మహిళల రక్షణ కోసం కమిషనరేట్ పరిధిలో షీటీంలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎవరైనా వేధింపులకు గురైతే షీ టీం నంబర్ 63039 23700కు సమాచారం అందించాలన్నారు. కార్యక్రమంలో షీ టీం సభ్యులు మానిక, సురేశ్, హెచ్ఎం శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చుకోవాలి



మాట్లాడుతున్న పీహెచ్ఎన్‌వో భాగ్యలక్ష్మి

కాల్వశ్రీరాంపూర్: విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చుకోవాలని కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆరోగ్యకేంద్రం పీహెచ్ఎన్‌వో భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలోని గంగారం గ్రామ పంచాయతీ పరిధిలోని ఊశన్నపల్లె ప్రభుత్వ పాఠశాలలో గురువారం విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత ఆరోగ్యం అనే అంశంపై అవగాహన కల్పించారు. ప్రతీఒక్కరు ఉతికిన దుస్తులు ధరించాలని, గ్లాసులు, ప్లేట్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. భోజనం చేసే సమయంలో చేతులు సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని, పరిశుభ్రతతోనే రోగాలు దరిచేరవన్నారు. హెచ్ఎం సమ్మయ్య, ఉపాధ్యాయులు శ్రీవాణి, ఏఎన్ఎం లంక సరిత, ఆశా కార్యకర్త శారద, విద్యార్థులు పాల్గొన్నారు.


జూనియర్ కాలేజీలో ఫేర్‌వెల్ డే



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

ముత్తారం: ముత్తారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం ఫేర్‌వెల్ పార్టీలో విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. వీడ్కోలు పార్టీలో విద్యార్థులు చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆటపాటలతో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రిన్సిపాల్ సయ్యద్ సలీం అభినందించారు.

రాష్ట్రస్థాయికి స్టడీ ప్రాజెక్టుల ఎంపిక



విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

గోదావరిఖనిటౌన్: ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల్లో పరిశోధనాశక్తి పెంపొందించే లక్ష్యంతో కళాశాల విద్యా కమిషన్ ఆధ్వర్యంలో ఏటా జిజ్ఞాస కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గోదావరిఖని డిగ్రీ కళాశాల విద్యార్థులు రూపొందించిన ఇంగ్లిష్, బోటనీ ప్రాజెక్టులు రాష్ట్రస్థాయి ప్రదర్శనకు ఎంపికయ్యాయి. ఇంగ్లిష్ ప్రాజెక్టులో ఎస్.లీలారాణి, యూ.నిరీక్షిత, ఎ.సాయిచరణ్, శాంతిప్రియ, భువనేశ్వర్, బోటనీ ప్రాజెక్టులో ఏ.రజిత, శ్రావణి, అక్షయ్, నదియా, అంజుమ్ ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు సూపర్‌వైజర్లు వై.సుబ్బారావు, సురేశ్, ప్రిన్సిపాల్ కిషన్ ఓజ, వైస్ ప్రిన్సిపాల్ సాంబశివరావు, కోఆర్డినేటర్ శారద, అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలి

పాలకుర్తి: గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించాలని ఎంపీడీవో రామ్మోహన్‌రావు అన్నారు. పాలకుర్తి మండల పరిధిలోని ఈసాలతక్కళ్ళపల్లి గ్రామాన్ని ఎంపీడీవో గురువారం సందర్శించారు. గ్రామంలోని నర్సరీని, సెగ్రిగేషన్ షెడ్డును పరిశీలించారు. మండల పంచాయతీ అధికారి సుదర్శన్, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అజయ్‌కి యువక్రాంతి సర్టిఫికెట్

ధర్మారం: రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో యువక్రాంతి బునియది శిక్షణ శిబిరంలో పాల్గొన్న ధర్మపురి నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు యశోద అజయ్‌కి రాష్ట్ర అధ్యక్షుడు శివచరణ్‌రెడ్డి సర్టిఫికెట్ అందించారు. సోనియమ్మ కుటీరం పేరుతో మూడు రోజుల పాటు జరిగిన శిబిరంలో అజయ్ పాల్గొన్నారు.

సింగరేణి వార్తలు

వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ల పాత్ర కీలకం



మాట్లాడుతున్న డైరెక్టర్ ఎల్‌వీ సూర్యనారాయణ

గోదావరిఖని: గనుల్లో ప్రమాదాల నివారణకు వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్ల పాత్ర కీలకమని సింగరేణి ఆపరేషన్స్ డైరెక్టర్ ఎల్‌వీ సూర్యనారాయణ అన్నారు. వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లకు గురువారం స్థానిక ఇల్లెందు క్లబ్‌లో భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. అన్ని గనులు, డిపార్ట్‌మెంట్లలో పనులను రక్షణతో భద్రత ప్రమాణాలు పాటించి చేపట్టాలని సూచించారు. వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లను పూర్తి స్థాయిలో సన్నద్ధం చేసేందుకు ఈ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. డీఎంఎస్ సుధీర్ జి.భైసారే, బానోతు వెంకన్న, విశ్వనాథ్ బిహేరా, ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి రాజ్‌కుమార్, ఆర్జీవన్ జీఎం లలిత్‌కుమార్, అన్ని గనుల వర్క్‌మెన్ ఇన్‌స్పెక్టర్లు, సేఫ్టీ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గని ప్రమాదాల్లో మరణించిన కార్మికుల ఆత్మశాంతి కోసం రెండు నిమిషాలు మౌనం పాటించారు.

‘సేవ్ సింగరేణి’ పేరుతో ఉద్యమం చేస్తాం



మాట్లాడుతున్న సీతారామయ్య

గోదావరిఖని: కాంట్రాక్టు కార్మికుల హైపవర్ కమిటీ వేతనాల అమలు కోసం ఉద్యమిస్తామని, కార్మికుల హక్కుల సాధన కోసం, సంస్థ పరిరక్షణ కోసం ‘సేవ్ సింగరేణి’ పేరుతో ఉద్యమం చేస్తామని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య పేర్కొన్నారు. స్థానిక భాస్కర్‌రావు భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రధాన కార్యదర్శి కొరివి రాజ్‌కుమార్‌తో కలిసి ఆయన మాట్లాడారు. కోలిండియాలో అమలు చేస్తున్న హైపవర్ కమిటీ వేతనాలు సింగరేణిలో చెల్లించడం లేదని, అమలు కోసం సింగరేణిపై ఒత్తిడి పెంచేందుకు ఏఐటీయూసీ పోరాటాలు చేస్తుందన్నారు. సివిక్, ఇతర విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనాల చట్టం అమలు కోసం ప్రవేశపెట్టిన రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జీవో 22 అమలు చేయాలన్నారు. సింగరేణిలో దాదాపు 30వేల మంది కాంట్రాక్టు కార్మికులు పర్మనెంట్ కార్మికులతో సమానంగా పని చేస్తున్నారని, వారికి చట్టం ప్రకారం చెల్లించాల్సిన వేతనాలు సింగరేణి చెల్లించడం లేదని ఆరోపించారు. సమావేశంలో ఏఐటీయూసీ ఉపప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆర్జీవన్ బ్రాంచి కార్యదర్శి ఆరెల్లి పోషం, నాయకులు ఎం ఏగొస్, కన్నం లక్ష్మీనారాయణ, కనకరాజు, మల్లేశ్, మల్లయ్య, తిరుపతి, సూర్య, వినయ్, రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

ఓబీ కార్మికుల సంబరాలు



సంబరాలు జరుపుకుంటున్న ఓబీ కార్మికులు

యైటింక్లయిన్‌కాలనీ: ఓబీ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు రూ.2800 పెంచడంతో రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీ తెలంగాణ చౌరస్తాలో ఓబీ కాంట్రాక్ట్ కార్మికులు కాలనీ కాంగ్రెస్ నాయకులతో కలిసి గురువారం మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు. ఓబీ కాంట్రాక్ట్ కార్మికులు తమ వేతనాలు పెంచాలని సమ్మె చేశారు. కాగా వారికి మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ అండగా నిలిచి వేతనాలు పెంచేలా కృషి చేయడంపై ఓబీ కార్మికులు హర్షం వ్యక్తం చేశారు. మంత్రి, ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ కాంగ్రెస్ నాయకులు పట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్, మాజీ కార్పొరేటర్ శంకర్ నాయక్, లక్ష్మణరావు, మార్క రాజు, రాములు, రఫీక్, సదానందం, శ్రీనివాస్, కుమార్‌నాయక్, రాజ్‌కుమార్, వేణు, ఓబీ కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొన్నారు.

ఎంపీడీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా దివ్యదర్శన్‌రావు



ఎన్నికపత్రం అందజేస్తున్న అధికారి సురేందర్

సుల్తానాబాద్: మండల పరిషత్ అభివృద్ధి అధికారుల సంఘం జిల్లాశాఖ ఎన్నికలు ఏకగ్రీవం జరిగినట్లు ఎన్నికల అధికారి, జిల్లా ముఖ్య కార్యనిర్వాహణాధికారి, సీఈవో కె.నరేందర్ తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో జిల్లా అధ్యక్షుడిగా ఎస్.దివ్యదర్శన్‌రావు (సుల్తానాబాద్), ఉపాధ్యక్షుడిగా బి.శైలజ (రామగిరి), ప్రధాన కార్యదర్శిగా కె.శ్రీనివాస్ (పెద్దపల్లి), కోశాధికారిగా ఎం.సురేశ్, ఎంపీడీవో (ముత్తారం), ప్రచార కార్యదర్శిగా జి.తిరుపతి (ఓదెల), అసోసియేట్ సెక్రటరీగా రామ్మోహనాచారి (పాలకుర్తి), ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా వై.భాస్కర్‌రావు (ఎలిగేడు), ఐ.ప్రవీణ్‌కుమార్(ధర్మారం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారి ప్రకటించారు.

అభివృద్ధిపై తేల్చుకుందామా..?

గోదావరిఖని: ప్రధాన చౌరస్తాకు వస్తే ఇప్పటివరకు బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి ఏమిటి? కాంగ్రెస్ చేస్తున్నదేమిటో తేల్చుకుందామని కాంగ్రెస్ నాయకులు మహంకాళిస్వామి, బొంతల రాజేశ్ సవాల్ విసిరారు. గురువారం ప్రెస్‌క్లబ్‌లోమాట్లాడారు. రూ.వందకోట్లతో ఈప్రాంతంలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. బసంత్‌నగర్ కేశోరాం సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులను పర్మినెంట్ చేసిన ఘనత ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌కే దక్కిందన్నారు. ఎన్నికల హామీ ప్రకారం ఇతర రాష్ట్రానికి చెందిన బిహార్ కార్మికులను వెళ్లగొట్టి ఇక్కడి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని వివరించారు. సమావేశంలో నాయకులు పెద్దెల్లి ప్రకాశ్, తిప్పారపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల జోలికి వెళ్లొద్దు

సుల్తానాబాద్: విద్యార్థులు మత్తు పదార్థాల జోలికి వెళ్లి భవిష్యత్ అంధకారం చేసుకోవద్దని కరీంనగర్ రీజినల్ నార్కోటిక్ కంట్రోల్ సబ్ ఇన్‌స్పెక్టర్ జి.రమేశ్ అన్నారు. పట్టణంలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో గురువారం గంజాయి, డ్రగ్స్, మాదక ద్రవ్యాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మాట్లాడుతూ డ్రగ్స్, గంజాయి, మద్యం తదితర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం మత్తు పదార్థాలతో కలిగే దుష్పరిణామాలపై ముద్రించిన పోస్టర్లను ఆవిష్కరించారు. పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి

ఓదెల: విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని పొత్కపల్లి ఎస్సై దికొండ రమేశ్ సూచించారు. మండలంలోని పొత్కపల్లి హైస్కూలులో గురువారం పదో తరగతి విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ మార్చిలో జరిగే పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పాఠశాలకు, తల్లితండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. ప్రధానోపాధ్యాయులు సాంబయ్య పాల్గొన్నారు.

కార్మిక హక్కుల సాధనే ఎజెండా

జ్యోతినగర్: దేశంలోని కార్మిక హక్కుల సాధన కోసమే నిరంతరం పోరాడుతానని వారి సమస్యలు పరిష్కారమే తన ఎజెండా అని ఐఎన్టీయూసీ జాతీయ కార్యదర్శి అడిషనల్ మెంబర్ బాబర్ సలీం పాషా అన్నారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని గురువారం ఐఎన్టీయూసీ అనుబంధ కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన పాల్గొన్నారు. ఎన్టీపీసీ ఉన్నత అధికారులతో పాటు ఐఎన్టీయూసీ ఉద్యోగుల సంఘం నాయకులు, కాంట్రాక్ట్ కార్మిక సంఘం నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ పత్రం అందజేత

రామగిరి: మండలంలోని జల్లారం గ్రామపంచాయతీ పరిధిలోని సింగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రేణికుంట్ల రాజేశ్వరికి రూ.2లక్షల విలువైన ఎల్‌వోసీని మంత్రి శ్రీధర్‌బాబు సహాయకులు అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆసుపత్రిలో వైద్య చికిత్స కోసం మంత్రిని సంప్రదించగా రూ.2లక్షల ఎల్‌వోసీ పత్రాన్ని రాజేశ్వరి కుటుంబ సభ్యులకు గురువారం హైదరాబాద్‌లో అందజేశారు.